# సుబ్బారావ్గా సైకిలు స్వారీ!

"శ్రీరాణి"



సుబ్బారావుకిప్పటికీ స్కూటరు త్రొక్కటం రాదు. అతికష్టంమీద మోపెడ్ నడపటం నేర్చుకున్నాడు. నేర్చుకొనేటప్పుడు యాక్సిడెంటు జరగాల్సింది తప్పిపోయింది. అసలు స్కూటరు కొనటానికి డబ్బులెక్కడివి?

ఏదో కంపెనీ పదిహేను వందల రూపాయలు అడ్వాన్సు కట్టి, మిగతా మూడు వేల అయిదు వందల రూపాయలు 20 వాయిదాలలో కట్టచ్చు అంటే తిప్పలుపడి, అడ్వాన్సు కట్టి ఆ మోపెడ్ తెచ్చుకొన్నాడు. అప్పుడు తనకి ఈ ఊరి జిల్లా ఆస్పత్రికి, రిక్వెస్టుమీద బదిలీ అయింది. అద్దె ఇల్లు గాంధీ నగరులో ఉండేది. ఇంటి నుంచి ఆస్పత్రికి రెండు కిలోమీటర్లు ఉండేదేమో! తను గెజిటెడ్ ఆఫీసరు గనుక మోపెడ్ మీద వెళితే హుందాగా ఉంటుందనుకున్నాడు సుబ్బారావు, పాపం!

అయితే పాపం పెట్రోలుకి బాగానే ఖర్చు పెట్టాల్సి వచ్చేది. అయినా భరించాడు. తర్వాత తను ఉద్యోగం నుంచి పదవీవిరమణ చేశాడు. (తను చెయ్యలేదు. యన్.టి. రామారావు ప్రవేశ పెట్టిన 55 ఏళ్లకే రిటైరుమెంటు అనే రూలుతో, తనను ఉద్యోగ విరమణ చేయించారు). తను అప్పుడు 56 సంవత్సరంలో ఉన్నాడు. సుబ్బారావు అసలే అర్భకుడు! ఏంచేస్తాడు? మిగతా ఉద్యోగులతో పాటు - నల్గురిలో నారాయణ - అనుకొంటూ పదవీ విరమణ చేశాడు. తర్వాత సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం సుబ్బారావును 58 నిండేదాకా ప్రభుత్వం జీతమిచ్చిందనుకోండి. అది వేరే విషయం! కానీ డబ్బు బ్యాంకులో వేసుకొంటే ఉందా? ఊహు! తనకూతురి పెండ్లి ఖర్చుల క్రింద కరిగిపోయింది.

ఆ మోపెడ్ మీద, తన కూతురిని... ఆఫీసుకు తీసుకువెళ్లేవాడు. తను కల్లూరి పంచాయతీలో ఊరిబయట కమలా నగరులో ఇల్లు కట్టుకొన్నాడు. అక్కడినుంచి అమ్మాయి ఆఫీసు కనీసం 5 కిలోమీటర్లుండేది. ఒకటి రెండు సంవత్సరాలు బాగానే పనిచేసింది. తర్వాత అప్పుడప్పుడు మొండికేసేది. మెకానిక్కు దగ్గరికి తీసుకెళ్లి - దానిని బాగు చేయించటానికి బోలెడు డబ్బులయ్యేవి. ఒకసారి రాజ్ విహార్ సెంటరు దాటిన తర్వాత అమ్మాయి చీర వెనక చక్రంలో తగుల్కోడం, బండిపడిపోవటం, దాంతో ఇద్దరూ క్రిందికి పడిపోవటం గబగబా జరిగిపోయింది. మోపెడుకు వెనక చక్రానికి గుడ్డలు తగులుకోకుండా, ఏ అడ్డూ లేదు. అదృష్టమేమంటే ఏ వాహనమూ వచ్చి వాళ్ళ మీదుగా పోలేదు. ఇద్దరి చేతులు, కాళ్లు కొంచెం దోక్కుపోయాయి. బండి పడడంతో, ట్రాఫిక్ ఆగిపోయింది. పాప గబాల్నున లేచి చీర సర్దుకొంది. సిగ్గుతో తన తల వంగిపోయింది.

అమ్మాయి ఆఫీసు మానుకొని ఇంటికి వచ్చేసింది, ఆ మోపెడ్ మీదనే జాగ్రత్తగా. దాంతో ఆ మోపెడంటే భయపడిపోయేవాడు సుబ్బారావు.

ఆయన కూతురు ఇంకో మంచి బండి కొన్నది. తరువాత కొన్నాళ్లు బాగానే సాగింది ప్రయాణం... అయిదేళ్ళయ్యాక - అదీ మొండికేయటం మొదలెట్టింది. ఎన్నిసార్లు, ఎన్ని వందలు ఖర్చు పెడతాడు రిపేర్లకు? విసుగుతో బండి మూల పెట్టాడు. అమ్మాయి కోసం ఆటో పిల్చుకొస్తే అమ్మాయి ఆటో ఎక్కి ఆఫీసుకు వెళ్ళిపోయేది. ఆటోలో వెళ్లేటప్పుడు - తను కొంచెం దూరం నడవాల్సివచ్చినా, వచ్చేటప్పుడు ఆటో ఎక్కి రావడం ఎంతో హాయిగా ఉందనిపించేది.

కానీ అసలు కథ ఇది కాదు, సుబ్బారావుకు సైకిలు త్రొక్కాలని చిన్నప్పటినుంచి బాగా కుతూహలంగా ఉండేది. స్కూలుకు వెళ్లే పిల్లలు సైకిలు త్రొక్కుతూ స్కూలుకు వెళుతుంటే వాళ్ళవేపు ఆశగా చూసేవాడు. తన నాన్నగారు లాయరు. ఆయనకు పెద్ద ఆదాయం లేదు. ఇల్లు గడవటమే కష్టంగా ఉండేది - తనకన్నా పెద్దవాడు అన్నగారున్నారు - అన్నకే సైకిలు లేదు ఇంక తనకెక్కడినుంచి వస్తుంది?

అయితే సైకిలు స్వారీ కోరికను సుబ్బారావు అదుపులో పెట్టలేకపోతున్నాడు. నాజరు పేటలో (తెనాలి) ఒకాయనున్నాడు. ఆయన క్రిమినల్ లాయరు... ప్రభుత్వం తరఫున విచారణ చేసేవాడు. ఆయనకిద్దరు సహోదరులు. పెద్దవాడి పేరు చలపతి అని జ్ఞాపకం - చిన్నవాడు రామారావు అనుకొంటాను. సుబ్బారావుకు రామారావుతో స్నేహముంది. ఇద్దరు కలసి స్కూలుకు వెళ్లేవాళ్లు, తిరిగేవాళ్లు. ఒకసారి ఏమయిందని?

చలపతి సైకిలు త్రొక్కుకొంటూ తన ఇంటి మీదుగా పోతున్నాడు. అతను సైకిలు త్రొక్కినంత వేగంగా మరెవ్వరూ త్రొక్కలేరు!

"రావోయి సుబ్బారావు! వెనక కూర్చో! నేను సైకిలు త్రొక్కుతాను!" అంటూ ఆహ్వానించాడు.

సుబ్బారావు ఈ అవకాశం విడవదల్చుకోలేదు.

"సరే!" అంటూ చలపతి త్రొక్కే సైకిలు వెనక సీటు మీద కూర్చున్నాడు. ఓ ప్రక్కన కాళ్లు పెట్టి

చలపతి సైకిలు త్రొక్కడం ప్రారంభించాడు. అదేం త్రొక్కడం బాబోయ్! అది సైకిలా? స్కూటరా? (అప్పుడు స్కూటర్లు ఇంకా మార్కెట్టులోకి రాలేదు). రయ్‌మని పోతున్నాడు. ఎదురొచ్చిన వారందరినీ అతి లాఘవంగా తప్పుకొంటూ ముందుకు దూసుకుపోతున్నాడు రైలింజనులాగా!

సుబ్బారావుకు భయమేసింది, కళ్ళు తిరుగుతున్నాయి... దేనికన్నా డ్యాష్ కొడితే! తన గతి అంతే! దారిలో ఎలక్ట్రిక్ స్తంభం కన్పించింది. దాని ప్రక్కగా వేగంగా పోతున్నాడు చలపతి.

"ఆగవయ్యా బాబూ!" అంటే ఆగకుండా ముందుకు దూసుకుపోతున్నాడు. సుబ్బారావు... సైకిల్ ఒక ప్రక్కనే కూర్చున్నాడు కాబట్టి అమాంతం చేతులతో కరెంటు స్తంభాన్ని ఢీ కొన్నాడు. ఆ స్పీడుకు దభేలున అల్లంత దూరం పోయి క్రిందపడ్డాడు. ఓ నిముషానికిగాని తెప్పరిల్లలేదు. కాళ్లూ- చేతులూ గీరుకొనిపోయాయి. నెత్తురొస్తున్నది. ఎలాగయితేనేమి తమాయించుకొని గుడ్డలు సర్దుకొని లేచాడు.

"ఇంక ఛస్తే వాడి సైకిలు మీద కూర్చోను!" అంటూ శపథం చేశాడు.

వాడి బావ (మేనమామ కుమారుడు) సైకిలు త్రొక్కుతాడు.

"రావోయ్ వెనక కూర్చో!" అన్నాడు ఓసారి.

"నువ్వు మెల్లగా తొక్కితే ఎక్కుతా" సుబ్బారావు అన్నాడు.

"సరేలే! ఎక్కు!" అన్నాడు బావ.

ముందు కొంచెం మెల్లగాపోయినా, వేగం పెంచేటప్పటికి సుబ్బారావు భయపడ్డాడు.

"ఆపయ్యా బాబూ!" అన్నాడు.

"ఈ స్పీడుకే అంత భయమయితే ఎలాగ? అన్నాడు సైకిలు ఆపుతూ.

"నాకు భయం బాబూ!" అంటూ దిగేశాడు.

ఇంకోసారి తన స్కూలుమేటు, స్కూలు లేనిరోజున నేర్చుకోమని, తన సైకిలిచ్చాడు. సుబ్బారావు.... భయం... భయంగానే తీసుకొన్నాడు. ఫెడలు ఎక్కి స్వారీ చేయడం - ఎంత ప్రయత్నించినా చేతకాలేదు. తనకు సీటు అందింది. సీటు ఎక్కి త్రొక్కడం నేర్చుకొన్నాడు.

ఓ గంట తర్వాత సైకిలు త్రొక్కటం నేర్చుకొన్నాడు. ఇంక తను సైకిలు తొక్కగలడు. అయితే ఫెడలు ఎక్కి... త్రొక్కడం చేతకాలేదు.

ఇలా, సుబ్బారావు, నెల్లూరులో పనిచేసేటప్పుడు, సైకిలు కొనటానికి ఇంత పూర్వ కథ ఉంది.


* * *

ఇంకా అసలు కథలోకి వస్తే...

నెల్లూరులో తను అద్దెకు తీసుకొన్న ఇల్లు జేమ్సు గార్డెన్సులో ఉంది. ఆఫీసు అక్కడికి 2 కి.మీ దూరంలో ఉంది. రోజూ నడిచి వెళ్లాలంటే కష్టం. ఇంక సైకిలు కొనక తప్పదు. అయితే తను గుమాస్తా! కాకపోతే హెడ్ గుమాస్తా! నానాతిప్పలు పడి... అనంతపురం నుంచి.... నెల్లూరుకి బదిలీ చేయించుకొన్నాడు. ఆ తర్వాత దానిమీదనే బదిలీ అనే నవల వ్రాయటం, అచ్చవటం జరిగిందనుకోండి) తను నాలుగు నెలలు సెలవుమీదున్నాడు. సెలవు జీతం రాలేదు. ఈ నాల్గునెలలు తెనాలిలో, బావమరది సాయంతోనే, నెట్టుకొచ్చాడు.

నెల్లూరులో చేరేటప్పటికి తన జేబులో కానీ లేదు. ఇంక సైకిల్ కొనటానికి డబ్బెక్కడినుంచి వస్తుంది? తీవ్రంగా ఆలోచించాడు. ప్రభుత్వం ఉద్యోగులకి మెడికల్ అడ్వాన్స్ ఇస్తున్నది, కుటుంబ వైద్య ఖర్చులకోసం. తాను పని చేసేదే ఊళ్ళో మెడికల్ ఆఫీసు. వెంటనే అడ్వాన్సు దరఖాస్తు పెట్టి మూడువందల రూపాయలు తీసుకొన్నాడు. దానికి మందుల బిల్లులు చూపించాలి. ఆ సంగతి తర్వాత చూద్దామనుకొన్నాడు.

మరి సైకిలు కొనాలంటే... కొంతన్నా దానిని గురించి... అది అమ్మే కంపెనీలను గురించీ, నాణ్యతను గురించి తెలుసుండాలిగదా! మరి



తనకేమీ తెలీదే! అదిగో అప్పుడు మేల్ నర్స్ రామ చంద్రం.... సుబ్బారావుకు సాయం చేశాడు. అతనే అన్ని షాపులూ తిరిగి ఓ షాపులో మంచి సైకిల్ దొరికితే అక్కడ కొన్నాడు.

ఇంక తను సైకిలు త్రొక్కి ప్రారంభోత్సవం చెయ్యాలి.

సైకిలుకు పసుపు, కుంకుమ పెట్టింది. సుబ్బారావు శ్రీమతి. పూలదండ వేసిరిది, కొబ్బరికాయ కొట్టి దిష్టి తీసింది, కర్పూరం వెలిగించి... సైకిలు చుట్టూ త్రిప్పింది. సుబ్బారావు లోపలికిపోయి వినాయకుడికి నమస్కారం పెట్టాడు. "స్వామీ... నా సైకిల్ సవారీకి ఏ విఘ్నం కలగకుండా చూడు" అని కోరుకున్నాడు. వినాయకుడు సుబ్బారావుని చూసి నవ్వుకొనే ఉంటాడు. కానీ అది సుబ్బారావుకు కనబడదు కదా! అప్పుడు సుబ్బారావుకి గుర్రమెక్కినంత ఉత్సాహంగా, సైకిలెక్కి తన కార్యాలయంవేపు దూసుకుపోయాడు. సైకిలు త్రొక్కుతుంటే గుఱ్ఱం మీద స్వారీ చేస్తున్న అనుభూతిని పొందాడు.

సుబ్బారావు ఆఫీసు మేడమీద! మరి సైకిలు స్టాండు మేడ క్రింద. కాంపౌండులో ఓ ప్రక్కగా ఉంది. సుబ్బారావు క్రొత్త సైకిలుని కార్యాలయం సిబ్బంది అంతా చూసి మెచ్చుకొన్నారు.

"బావుందండీ! సుబ్బారావుగారూ! ఎక్కడ కొన్నారేమిటి? మొత్తం ఎంతయింది?" అడిగారు.

చిలవలు పలవలుగా చెప్పాడు. "ఇది ర్యాలీ సైకిలండీ! చాలా బావుంటుంది. మొత్తం మూడు వందల పైనే అయింది!" అన్నాడు.

ఇప్పుడు సైకిళ్ల ఖర్చు 1,500/ - నుంచి 2,500 దాకా ఉంది. సుబ్బారావు సైకిలు కొన్నది 1962లో. అప్పుడు డబ్బుకి చాలా విలువుంది. రూ. 300/- అంది చాలా ఎక్కువన్నమాట.

"మరి మాకు పార్టీ ఇవ్వరా?" అడిగారు అంతా!

తప్పేదేముంది! ఓ స్వీటు, ఓ కారం, టీ తెప్పించి అందరికీ ఇచ్చాడు. అదో యాభై రూపాయల దాకా అయింది. పాపం సుబ్బారావుకు ఇలా ఖర్చు తప్పడం లేదు. అయితే తన సైకిల్‌కి దిష్టి తగలకూడదనే సుబ్బారావు ఆ పార్టీ ఖర్చు భరించాడు.

ఇంటి నుండి సైకిలు మీద రావటం, ఆఫీసు నుండి ఇంటికి పోవడం... హాయిగా ఉంది సుబ్బారావుకు. తన సైకిలు ఎవరూ దొంగిలించకుండా... మంచి తాళంని కొనివేశాడు. ఎక్కువ స్పీడు మీద వెళ్లేవాడు కాదు. సుబ్బారావు శ్రీమతి కూడా సైకిలు చూసి ముచ్చట పడింది. అయితే వెనక ఎక్కే సాహసం చెయ్యలేదు. సుబ్బారావు పిల్లలు చిన్నవాళ్లు. సైకిలి జోలికి వచ్చేవాళ్లు కాదు.

* * *

ఇలా చాలా రోజులు హాయిగా గడిచాయి. సుబ్బారావు సంతోషంగా ఉన్నాడు. తోటి ఉద్యోగులకు సుబ్బారావు సైకిలు మీద అసూయగానే ఉంది.

ఒక్కరోజు ఏమయిందంటే....

సుబ్బారావు ఆఫీసులో సాయంకాలం అయిదు గంటలు దాటితే ఉండేవాడు కాదు. తన పని అంతా ఆ లోపే ముగించుకొనేవాడు. 'మంచిపని వాడు' అని పేరు తెచ్చుకొన్నాడనుకోండి! అది వేరే విషయం!

ఆరోజు కూడా సాయంకాలం 5 గంటలకు తన పని ముగించుకొని, మేడమెట్లు దిగి, క్రిందకు వచ్చాడు, సైకిలు స్టాండులో తన సైకిలు తీసుకొందామని.

కానీ ఆశ్చర్యం! సుబ్బారావు కొత్త సైకిలు అక్కడ లేదు. మరెవరిదో ఉన్నది. తనది లేదు. తన సైకిలు రంగు నలుపు. క్రొత్తగా నిగ, నిగలాడుతూ ఉంటుంది. హాండిల్‌బారు తెల్లగా, వెండిలాగా, మెరుస్తూ ఉంటుంది. కూర్చునే సీటు కొత్తగా, మెత్త మెత్తగా ఉంటుంది.

అందరినీ అడిగాడు. తన సైకిలేమయిందని - "మేము చూడలేదు సార్!" అనే వాళ్లే అంతా. అందరు తమ సైకిళ్ల తీసుకెళ్లేదాకా, దిగులుపడిన ముఖంతో, సుబ్బారావు ఓపికగా కాచుకొని ఉన్నాడు. అందరూ వెళ్లిపోయారు. దిగాలు పడిన సుబ్బారావును చూసి, కొంతమంది నవ్వుకొన్నారు.

ఒక పాత డొక్కు సైకిలు మాత్రం ఉంది. దానికి తాళం ఉంది. కానీ తన సైకిల్ తాళం చెవితో తీస్తే తాళం వచ్చేసింది. ఎవరూ.. ఎంతసేపు చూసినా దానికోసం రాలేదు. చేసేది లేక ఆ సైకిలు తీసుకొని దాని మీదనే ఇంటికొచ్చాడు. సైకిలు వరండాలో పెడుతుండగానే, సుబ్బారావు శ్రీమతి వెంటనే అడిగింది.

"ఇది మన సైకిలు కాదే! ఎవరిది తీసుకొచ్చారు? మనదేమయింది?"

"అవును ఇది మనది కాదు. మన సైకిలు ఎవరో ఎత్తుకెళ్లారు. మా ఆఫీసు సైకిల్‌స్టాండులో ఇది మిగిలిపోయింది. ఇది తీసుకొచ్చాను." అన్నాడు సుబ్బారావు.

"భలేవారే! ఎవరి సైకిలో మనకెందుకండీ! పోలీసు రిపోర్ట్ ఇవ్వరాదూ?" శ్రీమతి అన్నది.

"అదీ ఆలోచించాను. మరి ఈ సైకిల్ మనది కాదని పోలీసు స్టేషనులో చెప్తే, మనదీ పోయి ఇదీ పోతుంది గదా! రేపు చూసి... తర్వాత చేద్దాం!" సుబ్బారావు అన్నాడు.

ఆరోజు రాత్రి సుబ్బారావుకి నిద్రపట్టలేదు. 'ఎంత మంచి సైకిలు తనది? ఎవరు ఎత్తుకెళ్లారు? పొరపాటునా? దొంగతనంగానా?'

సుబ్బారావు తనకు దొరికిన సైకిలు మీదనే ఆఫీసుకు వెళ్లి, స్టాండులో పెట్టి, ఆఫీసులో కూర్చున్నాడు.

ప్రైమరీ హెల్త్ సెంటర్‌లో పనిచేస్తున్న సీనియర్ అసిస్టెంటు షెరాఫ్ పరుగు పరుగున తన సీటు దగ్గరికి వచ్చాడు. ఇతను నిన్నగూడా, ఏదో పని మీద తనను కలుసుకొన్నాడు. తనకు అతను స్నేహితుడే!

"నమస్కారం సార్! చాలా పొరపాటయిపోయింది సార్!"

"ఏమిటి షెరాఫ్! నా క్రొత్త సైకిలు ఎవరు ఎత్తుకెళ్ళారయ్యా! పోలీసు రిపోర్టు ఇద్దామనుకొంటున్నాను" అన్నారు సుబ్బారావు.

"మీరోసారి క్రిందికి రండి!" అంటూ సుబ్బారావును క్రింద తీసుకెళ్లి... తనెక్కివచ్చిన క్రొత్త సైకిలు చూపించి... "ఇది మీదేనా సార్!" అడిగాను.

"అరె! ఇది నాదే! ఇక్కడికెలా వచ్చిందిప్పుడు?" ఆశ్చర్యంగా, ఆత్రంగా అడిగాడు సుబ్బారావు.

"నేనే తీసుకెళ్లాను సార్. నాదే అనుకొని. హడావుడిలో సైకిలు కొత్తదా, పాతదా అని చూడలేదు. తాళం తియ్యగానే వచ్చేసింది. ఎక్కి ఇంటికెళ్లిపోయాను. ఇంటికెళ్లాక చూస్తే సైకిలు క్రొత్త క్రొత్తగా ఉంది. ఇది నాది కాదే! అనుకొన్నాను. ఇది మీదనుకోలేదు. తెలిస్తే రాత్రికి రాత్రే మీ ఇంటికి చేర్చేవాడిని. పొరపాటయిపోయింది. క్షమించండి సార్!" అంటూ షెరాఫ్ సుబ్బారావు చేతులు పట్టుకొన్నాడు.

ఫక్కున నవ్వాడు ఆనందంతో సుబ్బారావు.

"భలే గమ్మత్తుగా ఉందే! ఇంకొంచెంసేపుంటే పోలీసు స్టేషన్లో రిపోర్టు ఇద్దామనుకొంటున్నాను. చాలా థ్యాంక్స్.... అదిగో మీ పాత సైకిలు. తీసుకెళ్లండి!" సంతోషంగా అన్నాడు సుబ్బారావు.

"నేనే మీకు థ్యాంక్స్ చెప్పాలి. మీరు రిపోర్టు ఇస్తే పోలీసులతో నానా తంటాలు పడాల్సివచ్చేది. ఇవ్వకుండా నన్ను రక్షించారు! మీ సైకిలు తీసుకోండి!" అంటూ క్రొత్త సైకిలు సుబ్బారావుకిచ్చాడు.

సుబ్బారావు శ్రీమతి దానికెంతో సంతోషించింది. ఇప్పుడు ఆ సైకిలు (1962లో కొన్నది) సుబ్బారావుతోపాటు, విశ్రాంతి తీసుకొంటున్నది. మార్కెట్టులోకి చైనా సైకిళ్లు వస్తే కొనాలనుకొంటున్నాడు సుబ్బారావు. ఆయన కోరిక నెరవేరేనా?